ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | సెప్టెంబరు 11, 2026 | సంపుటి : 7 | సంచిక : 87 | పేజీలు : 2



## మట్టి గణపతులను నిలబెడదాం

- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి
- ప్రకృతి వనరులను కాపాడుకుందాం..
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి ఈ వినాయక చవితికి మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణేశ్ విగ్రహాలను గురువారం కుడా కార్యాలయంలో హన్మకొండ జిల్లా కలెక్టర్, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి అధికారులు, సిబ్బందికి కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ... వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని, అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పండుగను జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా మన సంప్రదాయాన్ని కాపాడటంతో పాటు చెరువులు, కుంటలు, జలవనరులను కాలుష్యం నుంచి రక్షించవచ్చన్నారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, జలచరాలు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. అందువల్ల సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన గణేశ్ విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందన్నారు. భక్తితో గణపతిని ఆరాధిద్దామని. బాధ్యతతో ప్రకృతిని కాపాడుదామని. మన వినాయకుడు మట్టితో వస్తే.. మన భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి మిగులుతుందని సుధారాణి పేర్కొన్నారు.

ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ, ప్రతి గణేష్ మండపం మట్టి గణపతులనే ప్రోత్సహించి పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు ఆదర్శంగా నిలవాలని కోరారు. అధికారులు, సిబ్బంది మాత్రమే కాకుండా ప్రజలందరూ ఈ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... రకరకాల రంగులతో, రసాయనాలతో తయారు చేసే వినాయకులకు పూజ చేసి చెరువులను అలాగే పర్యావరణ కాలుష్యం చేయకుండా మట్టి వినాయకులనే అందులో నీటి ఎద్దడి వల్ల తక్కువ ఎత్తు ఉన్న వినాయకులనే ప్రతిష్టించాలన్నారు. ఒకప్పుడు వినాయకుణ్ణి తయారు చేయడానికి..చెరువు మట్టి వాడి మళ్ళీ.. అందులోనే నిమజ్జనం చేసేవారాని కలెక్టర్ తెలిపారు. మళ్ళీ అలాంటి రోజులు రావాలని పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలుసుకోవాలన్నారు. ప్రకృతి ని మనం కాపాడుకోవలిసిన అవసరం ఉందన్నారు. వివిధ కాలనీలో ఏర్పాటు చేసే మండపాల వద్ద... ఎంత తక్కువ వీలు అయితే అంతా తక్కువ ఎత్తు విగ్రహాలను పెట్టి పూజించుకోవాలన్నారు

పోటీ లకు పోకుండా ఆధ్యాత్మిక మార్గంలో ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సామ్యా నాయక్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీంరావు, పీసీబీ ఈఈ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ కుట్రలను
# బలంగా తిప్పికొట్టాలి
### ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు

- కాంగ్రెస్ నుంచి ఎదిగిన కొందరు కాంగ్రెస్‌కు నష్టం చేయాలని చూస్తున్నారు
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:**

అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారని బీఆర్ఎస్ నేతలను సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ కుట్రలను బలంగా తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని సభను నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభను సజావుగా జరగకుండా కుట్ర చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సభ్యులకు సీఎం అభినందనలు

అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారని బీఆర్ఎస్ నేతలను రేవంత్ రెడ్డి విమర్శించారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారని, శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పి కొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసినందుకు సభ్యులకు సీఎం అభినందనలు తెలిపారు.

సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని, సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా రాణించలేరని, అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు నష్టం చేసేందుకు కుట్ర జరుగుతోంది అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని గుర్తు చేశారు. సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చాలని కొందరు చూస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మా రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి కనిపించినట్టున్నారని ఎద్దేవా చేశారు. అంత ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సర్‌పై అప్రమత్తంగా ఉండండి

దేశానికి మనం చేసిన జనగణన రోల్ మోడల్ అని, ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత అని కొనియాడారు. తెలంగాణ నమూనాను జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని, ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతీ ఒక్కరు ఈ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.



## గణపతి నవరాత్రి ఉత్సవాలకు రండి

- సీఎం రేవంత్‌కు ఆహ్వానం

శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ని ఆహ్వానించింది. అసెంబ్లీలోని ఛాంబర్‌లో ముఖ్యమంత్రి ని దేవాదాయ శాఖ కమిషనర్, గణేష్ దేవాలయ కమిటీ అర్చకులు కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పలువురు శాసనసభ్యులు ఉన్నారు.



## కాశీబుగ్గలో ఘనంగా పోచమ్మ బోనాలు



**వరంగల్, ఆయుధం:** కాశీబుగ్గలో పోచమ్మ బోనాలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రిన్సి మహంకాళి జోగిని వారి ఆధ్వర్యంలో డీజే పాటలు, డప్పు చప్పుళ్ల నడుమ బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. కాశీబుగ్గలోని జోగిని వారి నివాసం నుంచి ప్రారంభమైన ఊరేగింపు మైసమ్మ గుడి మీదుగా ప్రధాన రహదారి వెంట కాశీబుగ్గ పోచమ్మ ఆలయం వరకు కొనసాగింది. నెత్తిమీద నాలుగు బోనాలతో జోగిని మహంకాళి, శిష్య బృందంతో కలిసి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని ప్రతి గల్లీలో, దుకాణాల వద్ద భక్తులు జోగిని అమ్మవారి తో బొట్టు పెట్టించుకుని, కొబ్బరికాయలు కొట్టించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్న అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జోగిని బోనాన్ని స్వీకరించి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం పసుపు, కుంకుమ, చీర తదితరాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తిని
# బీసీలు కొనసాగించాలి

- కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్
- న్యూశాయంపేటలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

(హనుమకొండ, ఆయుధం)



చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా హనుమకొండ న్యూ శాయంపేటలోనీ దోబీఘాట్ లో రజక అభివృద్ధి సంఘం అధ్యక్షుడు నెల్లుట్ల సారంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆవిష్కరించారు. ఆవిష్కరణ అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ పేద బడుగుబలహీన వర్గాల తరపున పోరాడిన వీరవనిత అని గుర్తుచేశారు. రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్పూర్తితో బీసీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు, పార్టీలు మాత్రం బీసీలను పట్టించుకోవడం లేదన్నారు. చాకలి ఐలమ్మ పేరుతో యూనివర్సిటీ పెట్టాలి. హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో భద్రకాళి బండ్ పై చాకలి ఐలమ్మ, సర్దార్ పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ ల విగ్రహాలు పెట్టాలని డిమాండ్ చేశారు. సాయిధపోరాట చరిత్ర ప్రజలందరికీ తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తానని.. ఇప్పుడు ఆ హామీ నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు ఇచ్చే వాటా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా ప్రభుత్వాలకు, పార్టీలకు బీసీలపై ప్రేమ ఉంటే 42% రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నూతనకంటి ఆనంద్, మాజీ కార్పొరేటర్లు తోట వెంకన్న, చీకటి ఆనంద్, పలువురు బీసీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- తక్కువ వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వసతులపై దృష్టి పెట్టాలి
- మండపాలకు ఉచిత విద్యుత్తు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

2 లో

## 25వ రోజు పాలిటెక్నిక్ విద్య పరిరక్షణ ఉద్యమం




వరంగల్, ఆయుధం: తెలంగాణ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థకు సంబంధించిన జీవో 97 నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ వరంగల్‌లో కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు 25వ రోజుకు చేరుకున్నాయి. పాలిటెక్నిక్ విద్య ప్రత్యేకత, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భవిష్యత్తు, బోధనా, బోధనేతర సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఈ ఉద్యమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ వరంగల్‌లో *విద్యార్థులు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాలిటెక్నిక్ వర్గాల ప్రతినిధులు నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ ఆందోళనను వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ, దాని అకడమిక్ నిర్మాణం, పరిపాలన, సిబ్బంది సేవా అంశాలు, విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాలు, డిప్లొమా సాంకేతిక విద్య భవిష్యత్తుపై ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, అన్ని వర్గాలతో *సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని* పాలిటెక్నిక్ వర్గాలు కోరుతున్నాయి. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగ/ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, స్థానిక కేంద్ర *TPJAC ప్రతినిధులు*, విద్యా రంగానికి చెందిన నిపుణులు మరియు సంబంధిత వర్గాలు పాల్గొన్నారు.



## కాజీపేట బస్ స్టేషన్ కు స్థల పరిశీలన

**హనుమకొండ, ఆయుధం:** ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రతిపాదిత కాజీపేట శాశ్వత ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి రైల్వేకు సంబంధించిన ప్రతిపాదిత స్థలాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం పరిశీలించారు. ప్రస్తుతం సిటీ బస్సుల రాకపోకలు కొనసాగుతున్న రైల్వే స్టేషన్ ముందు ఉన్న స్థలాన్ని, రైల్వే పాఠశాల స్థలం, రైల్వే స్టేడియం ప్రాంతంతో పాటు, స్టేడియానికి ఎదురుగా ఉన్న రైల్వేకు చెందిన సుమారు ఎకరం భూమిని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాజీపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న హైదరాబాద్ కు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆగే బస్టాండ్ ను కలెక్టర్ పరిశీలించారు. కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద శాశ్వత బస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన రైల్వే శాఖ ద్వారా ప్రతిపాదిత భూమిని సమకూర్చుకోవడం, రైల్వే శాఖతో భూమి మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం, తదితర అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఎం భవానీ ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం కిషన్ రావు, డిఎం ధరమ్ సింగ్, కాజీపేట తహసిల్దార్ రాజు, రైల్వే శాఖ ఇన్స్పెక్టర్ ఆఫ్ వర్క్స్ శ్రీనివాస్, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అన్నార్థుడి కథ విషాదాంతం..



**హనుమకొండ, ఆయుధం:** ఆకలితో ఉన్నవారిని చేరదీసి సేవాగుణం అన్నం పెట్టిన దంపతుల కథ విషాదాంతమైంది. సేవాగుణంతో వేలాది మందికి ఉచిత భోజనాలు అందించిన లింగాల కేదారి-పుష్పలత దంపతులు దానధర్మాల కోసం తమ ఆస్తులను సైతం విక్రయించారు. రెడ్డి కాలనీలో రూ.2 కోట్లు, చోటి మజీద్ ప్రాంతంలో రూ.కోటి విలువైన స్థిరాస్తులతో పాటు అగ్రంపహాడ్, పెంబర్తి సమీపంలోని 3.48 ఎకరాల భూములను అమ్ముకున్నారు. చివరకు సొంత గూడు లేకుండానే లోకం వీడిన వారి విషాదాంతం స్థానికులను కలచివేసింది.



# విద్యావ్యవస్థపై నిర్లక్ష్యం సరి కాదు

- కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్
- డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరాహార దీక్ష

(హనుమకొండ, ఆయుధం)

ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థులకు నష్టం చేకూర్చే జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు ముందు డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ హాజరై మద్దతు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులను ప్రభుత్వం రోడ్డున పడేసిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ముందుండి పోరాడిన విద్యార్థులు, తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సి రావడం అత్యంత విచారకరమని కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 11 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం తెచ్చిన జీవో నంబర్ 97 వారి భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తూ సమస్యలు తీర్చాలి, లేకపోతే విద్యార్థి లోకం ఉద్యమిస్తుందని సుందర్ రాజ్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులతో సహా పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

- డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**వరంగల్, ఆయుధం:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడి, తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన నిప్పుకణిక, మహిళాలోకానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ కొనియాడారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వర్ధన్నపేట టౌన్ లో అంబేద్కర్ సెంటర్ నందు చాకలి ఐలమ్మ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, పోరాట పటిమ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, టౌన్ అధ్యకుడు ఈగ దామోదర్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల, టౌన్ నాయకులు కార్యకర్తలు, అనుబంధాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మండల సమైక్య పదో వార్షిక మహాసభ



**వేలేరు, ఆయుధం:** వేలేరు మండల కేంద్రంలోని మండల సమైక్య భవనంలో మహిళా మండల సమైక్య 10వ వార్షిక మహాసభ ఏపీఎం అనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మండల సమైక్య అధ్యక్షురాలు రేణుక అధ్యక్షత వహించగా.. వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేకమైన సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళా సంఘం భవనాలు నిర్మించడం జరిగిందని, స్థల సేకరణ పూర్తి కాగానే మండల కేంద్రంలో ఎమ్మెల్యే సహకారంతో మండల సమైక్య భవనం ను నిర్మించడం జరుగుతుందని, మండల సమైక్యకు ప్రభుత్వం బస్సును కూడా అందివ్వడం జరిగిందని, వివిధ మహిళ సంఘల లో నీ మహిళలకు వివిధ సబ్సిడీ రుణాలను కూడా ప్రభుత్వం అందించడం జరుగుతుందని, ఎమ్మెల్యే మండలం అభివృద్ధి కోసం ప్రత్యేకమైన కార్యచరణ రూపొందించడం జరుగుతుందని సర్పంచ్ తెలిపినారు. అనంతరం మండల సమైక్య కార్యవర్గం సర్పంచ్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య కార్యదర్శి రాజమ్మ, సీసీలు రమాదేవి, నాగమణి, సతీష్, ఎం.ఎస్. కార్యవర్గ సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల వివో అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.




## ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

- ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్

**వరంగల్, ఆయుధం:** జీవితం జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని, వైఫల్యాలను వెక్కిరించి అఘాయిత్యాల ఆలోచనను మానుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిన మనిషి పరిపూర్ణుడు అవుతాడని ఆత్మహత్య ల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. గురువారం కరీమాబాద్ ఎస్.ఆర్.ఆర్ తోటలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినం సెప్టెంబరు 10ను పురస్కరించుకొని భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత 20 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యల నివారణపై నిరంతరం కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మంది జీవితాలను కాపాడడం అభినందనీయమని, ఇటీవల పోలీస్ శాఖలో జరుగుతున్న ఆత్మహత్యల పరంపరను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర పోలీసు డిజిపి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో పోలీసు వారికి ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహించడం మంచి కార్యక్రమనీ, ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే, అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారనీ తెలిపారు. భారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సీనియర్ వైద్యులు డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్, ఆత్మహత్యల నివారణ కమిటీ సభ్యులు విశ్రాంత కార్యనిర్వాహక వివాహక ఇంజనీర్ ఏ.సుధాకర్, ఆరోగ్య మిత్ర ప్రతినిధులు మల్లిపెద్ది కృష్ణశాస్త్రి, సుందర్ నాయక్, వెంకన్న పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- తక్కువ వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వసతులపై దృష్టి పెట్టాలి
- చెరువుల్లో ముందస్తుగా నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేయాలి
- మండపాలకు ఉచిత విద్యుత్తు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, ఆయుధం:** వినాయక చవితి, నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. హన్మకొండ పట్టణంలో గణపతి నవరాత్రుల, నిమజ్జనం ఏర్పాట్ల మీద సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలో శాసనసభ్యులు, కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తక్కువ వర్షపాతం కారణంగా ఈసారి నగరంలోని చెరువులు, నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో... నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఏర్పాట్లు, నీటి వసతి, పారిశుద్ధ్యం, విద్యుత్తు, ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. ఈ ఏడాది గతంతో పోలిస్తే వర్షపాతం తక్కువగా నమోదైనందున నిమజ్జన కార్యక్రమంపై ముందుగానే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ అధికారులు వేగంగా స్పందించి నిమజ్జనానికి అనువైన చెరువులు, నీటి వనరులను గుర్తించాలని సూచించారు. నీటి మట్టం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిమజ్జనానికి అనువుగా నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేపట్టాలని, అవసరమైన చోట్ల నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. భారీ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా క్రేన్లు, ఇతర అవసరమైన పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. బంధం చెరువులో గుర్రపు డెక్క, పూడికతీత పనులను అధికారులు మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని ఆదేశించారు. నిమజ్జనానికి ముందు చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన మౌలిక వసతులను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు EV శ్రీనివాస్ రావు, GWMC, టౌన్‌ప్లానింగ్, పోలీస్, విద్యుత్తు, ఆరోగ్య, ట్రాఫిక్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు

- డాక్టర్ అనితా రెడ్డి



**హనుమకొండ, ఆయుధం:** ప్రతి మనిషికి జీవితం లో సమస్యలనేవి చాలా సర్వసాధారణం అని వాటిని పరిష్కరించుకునే దారి చూసుకోవాలి కాని సమస్యల నుండి పారిపోవడానికి ఆత్మహత్య ల వైపు వెళ్లకూడదని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 10న అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకుని హన్మకొండ లోని స్వధార్ మహిళా ఆశ్రమంలో "ఆత్మహత్యల నివారణ లో మన పాత్ర" అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో సమస్యలు వచ్చాయని జీవితాన్ని ముగించాలని ఆత్మహత్య చేసుకోవడం అవివేకం అన్నారు.
వయస్సు సహకరించకపోయినా అవయవాలు సహకరించక పోయినా కూడా ఎంతో మంది జీవితాలను కొనసాగిస్తున్నారని.. ఏదో ఒక పని చేసుకుంటూ బతుకుతున్నారని చెప్పారు. అమ్మ, నాన్న తిట్టారని, టీచర్ కొట్టారనో, ప్రియులు దూరమయ్యారనో, మార్కులు తక్కువ వచ్చాయనో, మరెన్నో కారణాల చేత ఆత్మహత్యలు చేసుకోకండి. పైకి వచ్చిన వారంతా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొనే పైకి వచ్చారు. పిరికితనం వదిలి పోరాడటం నేర్చుకోండి, సమస్య ఉంది అంటే పరిష్కారం ఉందని అర్థం, మన జీవితాన్ని మనం ప్రేమించి గౌరవించి నప్పుడే అందంగా మలచుకోగలం, అర్థాంతరంగా ముగించాలను కుంటే ఎవరికి నష్టము మీకు మీపై ఆదారపడిన వారికే ఆగి ఆలోచించండి జీవితం చాలా అందమైనది తోటివారు భాధలో ఉన్న కష్టములో ఉన్న చేయి కలుపుదాం మనము ఉన్నమన్న ధైర్యాన్ని భరోసాని అందిద్దాం.. ఆత్మహత్యలను నివారిద్దం అని డాక్టర్ అనితా రెడ్డి మహిళలకు తెలియచేసారు, స్వధార్ లో ఆశ్రమంలో వివిధ సమస్యలతో వచ్చేవారు ఆశ్రయం పొందుతారని మానసికంగా బలహీనమైన మనస్సుతో ఉంటారని అందుకే నిత్యము కౌన్సిలింగ్ చేస్తూ వారిని ధృడంగా, ధైర్యవంతులుగా చేసి, వారి సమస్యలను వారే పరిష్కరించుకునే చేసి, స్వయం ఉపాధి శిక్షణలు ఇప్పిస్తూ ఆర్థికంగా అభివృద్ధి పరుస్తామని డాక్టర్ అనితా రెడ్డి తెలిపారు. స్వధార్ నిర్వాహకురాలు శైలజ, కమల, సంధ్య మహిళలు పాల్గొన్నారు.



## పారదర్శకంగా కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల లక్కీ డ్రా

- నిబంధనల ప్రకారమే ప్రవేశాలు
- అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జీ

**ములుగు, ఆయుధం:** కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి తెలిపారు. గురువారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయ తరగతుల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు తావులేకుండా కేంద్రీయ విద్యాలయ నిబంధనలను అనుసరించి నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణతోపాటు అందుబాటులో ఉన్న సీట్లను లక్కీ డ్రా ద్వారా భర్తీ చేసి, ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రధానాచార్యులు సీతారాం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి



**వరంగల్, ఆయుధం:** జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యాలయంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ ఐలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ ప్రసంగిస్తూ వరంగల్ జిల్లాలో మారుమూల పల్లెలో రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామంలో రజక కుటుంబంలో జన్మించిన చాకలి ఐలమ్మ స్త్రీలంటే చిన్నచూపు చూసేవారందరికీ కనువిప్పు కలిగించిందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం చాకలి ఐలమ్మ పోరాటం కనువిప్పు కలిగించింది. దేశము ఖ్‌లను ఎదిరించి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో తన పేరు లిఖించుకున్న వీర వనిత చాకలి ఐలమ్మ. తెలంగాణ తొలి భూ పోరాట వీరురాలిగా తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ఆమె పేరు లిఖితమైంది అని ఆయన ఆమె సేవలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ చిన్నబాబు, సిబ్బంది ఎం.అరుణ, లలిత, రజిత, కాంగ్రెస్ నాయకులు, దౌడు నాగరాజ్ పాఠకులు పాల్గొన్నారు.

## నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

- 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు
- సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి




**హనుమకొండ, ఆయుధం:** నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదేనని, తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. గురువారం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో సిపిఐ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా కూడా తెలంగాణ ప్రాంతం నైజాం రాజు ఆధీనంలో ఉండి నియంత, నిరంకుశ పాలన వల్ల భూస్వాములు, పటేల్, పట్వారి లు గ్రామాలలో తమ ఆగడాలు పెట్రేగి పోతున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరి, బానిసత్వంకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూం మొయినుద్దీన్ పిలుపునిచ్చారని తెలిపారు. ఆ పిలుపునందుకుని 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని, 3000 గ్రామాలను విముక్తి చేసిందని, 4500 మంది కమ్యూనిస్టులు తమ రక్తాన్ని చిందించి ప్రపంచ చరిత్రను సృష్టించారని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితమే 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయిందని కొనియాడారు. నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర ముమ్మాటికి కమ్యూనిస్టులదే అన్నారు. తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, దానిలో భాగంగా సెప్టెంబర్ 11న హనుమకొండ జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ఏకశిల పార్క్ టాను నాయక్ విగ్రహం వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. సెప్టెంబర్ 11న జరిగే ప్రారంభ కార్యక్రమాన్ని, సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రద చేయాలని వారు ప్రజలను కోరారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్, నపూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, గుంటీ రజిత, పాల్గొన్నారు.

## శక్తి సదన్ స్వాధార్ గృహ్ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**హనుమకొండ, ఆయుధం:** నగరంలోని శక్తి సదన్ ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కలెక్టర్ శక్తి సదన్ లోని వసతులను పరిశీలించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న ఇన్‌మేట్స్ తో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శక్తి సదన్ లో నిర్వహిస్తున్న అడ్మిషన్స్ రిజిస్టర్, స్టాఫ్ రిజిస్టర్, ఇన్‌మేట్స్ అటెండెన్స్ రిజిస్టర్, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గృహ్ లో అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ వంటి వృత్తి విద్యా కోర్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఇన్‌మేట్స్ కు అందిస్తున్న భోజన మెనూ గురించి, తాగునీరు ఎక్కడి నుండి అందిస్తున్నారు, నాణ్యత ఎలా ఉంది అనే విషయాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్‌మేట్స్ తో ఇంటరాక్ట్ అయ్యి... అందరూ తమ చదువులను పూర్తి చేసుకోవాలని, చదువు పూర్తయిన తర్వాత వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించి, వారు స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎమ్.విశ్వజా, ఈ.వో. ఆశాదేవి, శక్తి సదాన్ సూపరింటెండెంట్ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆత్మహత్య ఆలోచన కాదు...

## ఆశల సాధన

- 'SUICIDE' పదానికే కొత్త అర్థం చెప్పిన ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీలత అందే!



**వరంగల్, ఆయుధం:** క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం నూరేళ్ల జీవితాన్ని బూడిద చేస్తుంది. సమస్యలు వచ్చినప్పుడు ఆత్మహత్య పరిష్కారం కాదని, బ్రతికి సాధించడం లోనే అసలైన గెలుపు ఉందని హితవు పలుకుతున్నారు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ వరంగల్ యూనిట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీలత అందే. సెప్టెంబర్ 10న 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం' సందర్భంగా ఆమె సమాజానికి ఒక సంచలనాత్మక, సానుకూల సందేశాన్ని అందించారు. ఈ ఏడాది "చేంజింగ్ ది నరేటివ్ ఆన్ సూసైడ్ స్టార్ట్ ది కాన్వర్సేషన్" (ఆత్మహత్యలపై దృక్పథాన్ని మార్చడం సంభాషణను ప్రారంభించడం) అనే ఇతివృత్తంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

### ప్రతి 40 సెకన్లకో ప్రాణం బలి!

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఆందోళనకర గణాంకాలను వెల్లడిస్తూ... ప్రపంచవ్యాప్తంగా ప్రతి 40 సెకన్లకు ఒకరు ఆత్మహత్యకు యత్నిస్తున్నారని డాక్టర్ శ్రీలత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నైరాశ్యంలో ఉన్నవారికి ధైర్యం నింపేందుకు, ఆత్మహత్య ఆలోచనలను పటాపంచలు చేసేందుకు "SUICIDE" అనే ఆంగ్ల పదాన్నే ఒక ఆశా కిరణంగా మార్చి, దానిలోని ప్రతి అక్షరానికి సానుకూల అర్థాన్ని వివరిస్తూ కొత్త భాష్యం చెప్పారు.

- 'SUICIDE' అంటే ప్రాణం తీసుకోవడం కాదు... మీలోని ప్రత్యేకతను గుర్తించడం!
- S Smart and Special: మీరు ఎంతో తెలివైనవారు, సమాజంలో చాలా ప్రత్యేకమైనవారు.
- U Unique: ప్రపంచంలో మీలాంటి వ్యక్తి ఇంకొకరు ఉండరు. మీరు అత్యంత విశిష్టమైనవారు.
- I Identified person: మీరు సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న వ్యక్తి.
- C Cooperative: అందరితో కలిసిపోయే, సహకరించే గొప్ప గుణం మీలో ఉంది.
- I Informative & Skilled: జీవితంలో ఏ రంగాన్నైనా జయించే సమాచారం, నైపుణ్యాలు మీ దగ్గర ఉన్నాయి.
- D Dedicated: మీరు తలపెట్టిన పనిని నిబద్ధతతో, అంకితభావంతో చేసే మనస్తత్వం మీది.
- E Embassidor: మీ సొంత వ్యక్తిత్వానికి, సామర్థ్యానికి మీరే ఒక రాయబారి (అంబాసిడర్).

### మాట్లాడండి... జీవితాన్ని గెలవండి!

సమాజంలో మీ స్థానాన్ని వేరే ఎవరూ భర్తీ చేయలేరని, ప్రతి ఒక్కరి జీవితం ఎంతో విలువైనదని డాక్టర్ శ్రీలత స్పష్టం చేశారు. మనసులో బాధ లేదా సమస్యలు ఉన్నప్పుడు ఒంటరిగా కుమిలిపోకుండా, మౌనాన్ని వీడి ఇతరులతో "సంభాషణ ప్రారంభించడం" ద్వారా ఎంతటి పెద్ద సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని పిలుపునిచ్చారు. ఆత్మహత్య ఆలోచనలు వస్తే ఒక్క క్షణం ఆగి, మీలోని 'ప్రత్యేకతను' గుర్తుచేసుకొని ముందడుగు వేయాలని ఆమె ఆకాంక్షించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695